## మూసీ సుందరీకరణ ప్రభుత్వ లక్ష్యం


కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడుతున్న కురాకుల కృష్ణ

గోల్కొండ: మూసీ ప్రక్షాళనలో హైడ్రా పాత్ర ఏమాత్రం లేదని కార్వాన్ నియోజకవర్గ ఏ–బ్లాక్ అధ్యక్షుడు కురాకుల కృష్ణ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకునే వ్యక్తి అని మూసీని సుందరీకరణ చేయడమే ఆయన లక్ష్యమని ఆదివారం కార్వాన్‌లో జరిగిన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఆయన స్పష్టం చేశారు. మూసీ సుందరీకరణ నచ్చని వారు మూసీ పరీవాహక ప్రాంతంలో హైడ్రా ఇళ్లు కూలుస్తుందని నిరాధారణ ఆరోపణలు చేస్తున్నారన్నారు. పక్కా పథకం ప్రకారమే మూసీ ప్రక్షాళన కొనసాగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.కిషన్, రాంకుమార్, కృష్ణ, కరణ్ కుమార్ తదితరులున్నారు.

## ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి


నిరసన తెలియజేస్తున్న కమిటీ నేతలు

నాంపల్లి: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ నేత ఎస్.ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో నాంపల్లి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లారు. ఆదివారం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మన్నె శ్రీధర్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన సభకు చేరుకుని ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ..రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని, కుల గణనను వెంటనే చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు బలవంతరావు, రాజేష్, కళ్యాణ్, శ్రీను పాల్గొన్నారు.

## 'బాధితులకు అండగా ఉంటాం'

జియాగూడ: ప్రభుత్వం నిరుపేదల ఇళ్లు కూల్చివేసి వారిని రోడ్డుపాలు చేస్తుందని మాజీ స్పీకర్ మధుసూదనాచారి ఆరోపించారు. ఆదివారం జియాగూడలోని కేసరినగర్ ప్రాంతాన్ని సందర్శించి మూసీ పరీవాహక బాధిత కుటుంబాలతో మాట్లాడారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ..కేసీఆర్ ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద ఇళ్లను కూల్చివేస్తుందన్నారు. నిరుపేదలకు పూర్తి మద్దతు ఉంటుందని, ప్రజలతో కలిసి పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పెట్లూరి రఘు, చిరు రాజ్, అనిత, శ్రీనివాస్‌గుప్తా, నరహరిచారి, మంగి కిషోర్‌కుమార్, సుకన్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

## 'కాంగ్రెస్ హయాంలో రైతన్నలకు అన్యాయం'


మాట్లాడుతున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: కాంగ్రెస్ హయాంలో రైతన్నలకు తీరని అన్యాయం జరుగుతుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన గుడిమల్కాపూర్‌లో బీజేపీ నాయకులతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణలో రైతుల గోడును సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని కేవలం కొద్దిమంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. నేడు ఇందిరా పార్కు వద్ద రైతు హామీల సాధన దీక్ష నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి రైతులు ఈ దీక్షకు తరలివస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నామ యాదగిరి నేత తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు

జియాగూడ: కేసరి హనుమాన్ ఆలయ సమీపం మూసీ నది బతుకమ్మ ఘాట్‌ను శుభ్రం చేసి సుందరీకరణ చేసే పనులను ఆదివారం జీహెచ్ఎంసీ సిబ్బంది చేపట్టింది. ఇటీవల ఖైరతాబాద్ జోన్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి కార్వాన్ శివశంకర్ క్రాంతి సేవా సమితి అధ్యక్షుడు పడాల అనంత్‌కృష్ణ ఇచ్చిన వినతిపత్రం మేరకు బతుకమ్మ ఘాట్ సుందరీకరణ పనులను చేపట్టారు. మూసీ దిగువకు గల మెట్లకు మరమ్మతులు, చెత్తాచెదారం, ముళ్ల చెట్ల తొలగింపు, దోమల నివారణకు ఫాగింగ్, బతుకమ్మ కుంట శుభ్రం చేస్తున్నట్లు అనంత్‌కృష్ణ తెలిపారు.



### ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి

సుల్తాన్‌బజార్: ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆటో జేఏసీ నాయకులు సయ్యద్, హుస్సేన్, లతీఫ్, ఖదీర్, మక్బూల్, అమీన్, అఫ్రోజ్, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గుర్తును బుల్డోజర్‌గా మార్చుకోండి

- ఇచ్చిన హామీలకు డబ్బులు లేవంటూ మూసీ సుందరీకరణకు ఎలా వస్తాయి?
- పేదవాళ్ల రక్తం తోడి సుందరీకరణ చేస్తారా..?
- మాజీ మంత్రి హరీశ్‌రావు


బాధితులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

లంగర్‌హౌస్: కాంగ్రెస్ పార్టీ చెయ్యి గుర్తు తొలగించి బుల్డోజర్ గుర్తు పెట్టుకోవాలని ప్రపంచ బ్యాంకులో తమ ఇళ్లు, స్థలాలను గిరివి పెట్టడానికి మీ అయ్యా జాగీర్లు కావని మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ పరీవాహక నివాసితులను పరామర్శించేందుక ఆదివారం ఆయన లంగర్‌హౌస్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ..పేదల రక్తంతోడి మూసీ సుందరీకరణ చేస్తామంటే సహించేది లేదన్నారు. ఇళ్లు కట్టడానికి పేదలు జీవిత కాలం సరిపోదని, అలాంటిది వారి ఇళ్లను ప్రపంచ బ్యాంకులో తాకట్టు పెట్టి వారి ప్రాణాలు తీస్తామంటే తిరగబడతామన్నారు. ప్రజలెవ్వరూ భయపడవద్దని అందరికీ కేసీఆర్ తోడుగా ఉన్నారని మీ అందరిలో భరోసా నింపడానికే తమను పంపారన్నారు. ఇళ్ల జోలి వస్తే ముందు తమ ప్రాణాలు అడ్డుపెడతామన్నారు. రాహుల్ గాంధీ వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ యోగి ఆదిత్యనాథ్‌పై బుల్డోజర్ రాజ్యం చెల్లదంటున్నారు, కానీ ఇక్కడ తెలంగాణలో బుల్డోజర్ రాజ్యం ఏంటని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ప్రజలు ఎప్పుడు రోడ్డునపడలేదని, ఆయన హయాంలో అభివృద్ధికి నిర్మాణాలు చేసి, పేదల సంక్షేమానికి కృషి చేశారని ఇలా పేదలకు ఎప్పుడు ఇబ్బంది పెట్టలేదన్నారు.

### సంక్షేమానికి మాత్రం డబ్బులు లేవా..?

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ప్రతి మహిళకు నెలకు రూ.2500 ఇస్తామన్నారు. హామీలు నెరవేర్చలేరు, ప్రభుత్వ ఆస్పత్రులలో మందులు సరఫరాకు డబ్బులు లేవు అంటున్నారు, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో భోజనాల డబ్బులు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం వద్ద ఖజానా లేదంటూ మూసీ కోసం లక్ష యాభై వేల కోట్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. 2013లో ప్రభుత్వ, ఎఫ్‌టీఎల్ ఏ రకమైన భూమి అయినా పేదల నుంచి ప్రభుత్వం తీసుకోవాలంటే కాంగ్రెస్ తీసుకు వచ్చిన చట్టాన్ని గుర్తు చేశారు. ఇంటి విలువకు మూడు రేట్లు అదనంగా డబ్బు, ఇంట్లో ప్రతి ఒక్కొక్కరికి రూ.5 లక్షలు అన్ని వసతులతో ఉన్న డబుల్ బెడ్ రూంలను ఇవ్వాలని కాంగ్రెస్ తీసుకువచ్చిన చట్టాన్ని మర్చిపోయారా అన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబిత ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, కార్తీక్ రెడ్డి, స్థానిక నాయకులు అమర్‌సింగ్, ఉదయ్‌కుమార్ ఉన్నారు.

### పదవీ విరమణ వీడ్కోలు



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మీర్జా నయిముద్దీన్ బేగ్ శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, ఎస్సైలు, సిబ్బంది నయిముద్దీన్ బేగ్‌కు ఘనంగా శాలువా, పూలమాలతో సత్కరించి వీడ్కోలు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ మాట్లాడుతూ..పదవీ విరమణ అనేది ఉద్యోగానికి కానీ.. సేవలకు కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రవి, సిబ్బంది పాల్గొన్నారు.

### ఐఎంఏ నగర శాఖ కమిటీ ఎన్నిక

సుల్తాన్‌బజార్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హైదరాబాద్ నగర శాఖ కమిటీ ఆదివారం నియామకమైంది. అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీరంగ్ ఆప్కారి, ఎలక్టెడ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ ఐలయ్య, కార్యదర్శిగా డాక్టర్ మినాజ్, కోశాధికారిగా డాక్టర్ పల్లం ప్రవీణ్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ చైర్మన్‌గా డాక్టర్ సంజుసింగ్ యాదవ్, సభ్యులుగా డాక్టర్ ఆర్‌కేయాదవ్, వైజయంతి వ్యవహరించారు. వీరితో పాటు నలుగురు వైస్ ప్రెసిడెంట్‌లు, ముగ్గురు జాయింట్ సెక్రెటరీలు, 15 మంది ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్‌ను ఎన్నుకున్నారు.

## గుండె ఆరోగ్యంపై అవగాహన ఉండాలి


వాకథాన్‌లో ప్రసంగిస్తున్న వైద్యులు

లంగర్‌హౌస్: గుండె ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెనోవా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నగేష్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ షోయబ్ అన్నారు. రెనోవా గ్రూప్ ఆఫ్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ నుంచి ఆదివారం 3కే వాకథాన్ నిర్వహించారు. ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన ఈ వాకథన్‌లో భారతీయ యోగా సంస్థాన్, తపోవనం కమిటీ సభ్యులతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వైద్యులు మాట్లాడుతూ.. గుండె జబ్బులు రాకుండా ఆహార నియమాలు పాటిస్తూ, రోజు వ్యాయామం చేయాలన్నారు. ప్రముఖ సంఘసేవకులు రాజు వస్తాద్, రెనోవ ముఖ్య వ్యాపార అభివృద్ధి అధికారి జహీర్, మేనేజర్ మోసిన్ బృందం పాల్గొన్నారు.

## 3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు, సాయంత్రం 6 గంటలకు భక్తుల గోత్రనామాలతో శ్రీ లక్ష్మీ సహస్రనామ కుంకుమార్చన నిర్వహించడం జరుగుతుందన్నారు. సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు ధార్మిక, సంగీత, కూచిపూడి నృత్య కార్యక్రమాలు ఉంటాయన్నారు. 12న విజయదశమి దసరా పండుగ సందర్భంగా ఉదయం స్వామి వారికి అభిషేకం, సాయంత్రం 6 గంటలకు శ్రీవారి శాంతి కల్యాణం, షమీ పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, కూచిపూడి రమాదేవి బృందం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నవరాత్రి ఉత్సవాల్లో లక్ష్మీ సహస్ర నామ కుంకుమార్చన ఉదయం, సాయంత్రం గోత్రనామాలతో నిర్వహించడం జరుగుతుందన్నారు. రూ.200లు సమర్పించి భక్తులు అర్చన నిర్వహిస్తారన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు సామూహిక సంక్షేప రామాయణం పారాయణం ఉంటుందన్నారు.

## కుల సంఘాలు ఐక్యంగా హక్కులను సాధించుకోవాలి

బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

గౌలిపురా: కుల సంఘాలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. గౌలిపురా ఆరె కటిక భవనంలో ఆదివారం ఆరె కటిక పొదుపు, పరపతి సహకార సంఘం లిమిటెడ్ 10వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తన దృష్టికి వచ్చిన బీసీ కులాల సమస్యలను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తాను కూడా పాతబస్తీలో పుట్టి, పెరిగి, చదువుకొని రాజకీయ జీవితాన్ని కాంగ్రెస్ పార్టీలో కొనసాగిస్తున్నానన్నారు. పాతబస్తీ మేకలమండి చాలా మందికి జీవనోపాధి కల్పించేదని..ప్రస్తుతం అది మూతబడి ఆరె కటిక కులస్తుల జీవితాలు చిన్నాభిన్నామయ్యాయన్నారు. మేకలమండిని ప్రారంభించడానికి కృషి చేస్తానన్నారు. గౌలిపురా ఆరె కటిక సొసైటీ ఇంత మంచిగా నిర్వహిస్తున్న కమిటీకి అభినందనీయమన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కుల గణనను ప్రారంభిస్తుందని..అందులో అందరూ పాల్గొనాలన్నారు. సక్రమంగా కుల గణనను వినియోగించుకోవాలని లేని యెడల కుల సంఖ్య తగ్గే ప్రమాదముందన్నారు. అనంతరం ఆయన సొసైటీ సభ్యులకు డివిడెంట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆలే జితేంద్ర, చెకోలేకర్ శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు యు.యశ్వంత్ రావు, ప్రధాన కార్యదర్శి పి.ప్రకాశ్ రాజ్, కోశాధికారి కె.అంబాదాస్, ఉపాధ్యక్షులు ఎం.రమేశ్, సహాయ కార్యదర్శి జె.బాబురావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.దశరథ్ రాజ్, కార్యవర్గ సభ్యులు పి.రఘురామ్, జె.సరిత, ఎం.రవిత, శ్రీశైలం అన్నదాన సత్రం చైర్మన్ శ్రీనివాస్, వి.మురళీధర్, ఎన్.రవి కుమార్, టి. కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

## 15 మందికి పట్టాలు అందజేత


పట్టాలను అందజేస్తున్న తహసీల్దార్ రాజశేఖర్, రఘునాథ్

జియాగూడ: జియాగూడ కార్వాన్ మూసీ ప్రాంతాలకు చెందిన వారికి జియాగూడ 2బీహెచ్‌కేలో ఇళ్లు కేటాయిస్తున్నట్లు గండిపేట తహసీల్దార్ రాజశేఖర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడ డబుల్‌బెడ్‌రూమ్‌లో కేసరినగర్, దరియాబాగ్‌లకు చెందిన సుమారు 15 మందికి పట్టాలను అందజేశారు. స్థానిక బీజేపీ గోల్కొండ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రఘునాథ్ ఆయా బస్తీల వాసులకు దగ్గర ఉండి పట్టాలను ఇవ్వడంలో సహకరించారు.

# 'నగిషీ'లలో దిట్ట..

- పెంబర్తి నుంచి నగరానికి వచ్చి ఉపాధి పొందుతున్న నగిషీ కళాకారులు
- ధ్వజస్తంభాలు, గోపురాలకు అద్భుతమైన డిజైన్‌లు



గోల్కొండ: నగిషీ కళాకారులకు జనగాంలోని పెంబర్తి గ్రామం పెట్టింది పేరు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెంబర్తి గ్రామంలోని నగిషీ కళాకారులకు ట్రోఫీలు, శిల్పాల తయారీకి ఆర్డర్లు ఇచ్చేది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని స్టోర్‌లలో పెంబర్తిలో తయారైన ట్రోఫీలు, దేవతా విగ్రహాలు కనపడేవి. అయితే కాలక్రమేణా నగిషీ కళాకారులకు కష్టకాలం మొదలైంది. మరోవైపు ప్రభుత్వపరంగా కూడా ఆదరణ తగ్గింది. దీంతో 2, 3 తరాలకు చెందిన నగిషీ కళాకారులు ఇతర వృత్తులకు మారారు. పలువురు ఉద్యోగాలు చేస్తుండగా మరికొందరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. అయితే కొన్ని కుటుంబాలు మాత్రం నేటికీ నగిషీ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. పెంబర్తి గ్రామంలో ఉపాధి కరువవడంతో పలువురు నగిషీ కళాకారులు నగరాల వైపు మళ్లారు. పెంబర్తికి చెందిన నగిషీ కళాకారుడు మక్తాల దుర్గాచారి తన కుటుంబంతో హైదరాబాద్‌నగరానికి వచ్చి స్థిరపడ్డాడు. దుర్గాచారితో బాటు చాలా కుటుంబాలు హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాలకు పొట్టకూటి కోసం వలస వెళ్లారు. నగరంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని ఆలయాలు, ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో ఉన్న ఆలయాల కమిటీల సాయంతో దుర్గాచారి జీవనోపాధి పొందుతున్నారు. ధ్వజస్తంభాలకు, ఆలయాల ద్వారాలకు తాపడం చేయడంలో దుర్గాచారిది అందెవేసిన చేయి.

**చేయిపడితే అందాల నగిషీలు...**

దుర్గాచారి చేయిపడితే అందాల నగిషీలు కొన్ని గంటల్లోనే సిద్ధమవుతాయి. ముందుగా చేయాల్సిన తాపడాలను చూసి దానికి అనుగుణంగా ఇనుప, వెండి, ఇత్తడి రేకులపై డిజైన్‌లు వేసుకుంటారు. అనంతరం చేతి పనిముట్లతోనే అద్భుతమైన డిజైన్‌లు వేస్తారు. ఆలయానికి ఉన్న తలుపులు, ప్రధాన ద్వారాలకు, గడపలను అద్భుతంగా తీర్చిదిద్దడం నగిషీ కళాకారులకే సాధ్యం. ముఖ్యంగా వెండి రేకులపై డిజైన్‌లు వేయడం అత్యంత కష్టం. చిన్నచిన్న పనిముట్లతో దేవత విగ్రహాలతో పాటు దేవుళ్ల పేర్లను సైతం అందంగా చెక్కడం వీరికే సాధ్యం.

### వృత్తిపై మక్కువతో..



స్వగ్రామమైన పెంబర్తిలో ఆర్డర్లు దొరకడం కష్టం. దీంతో రెండు దశాబ్దాల క్రితమే నగరానికి వలస వచ్చాం. ఆలయాల పునరుద్ధరణ తదితర సమయాల్లో ఆర్డర్లు వస్తున్నాయి. అవసరమైన ముడిసరుకుతో ఆలయ ప్రాంగణంలోనే నగిషీలు తయారు చేస్తున్నా. మా కుటుంబ సభ్యులు ఎవరూ నేడు ఈ వృత్తిలో లేరు. ప్రభుత్వం నగిషీ కళాకారులకు గౌరవ పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలి.

– మక్తాల దుర్గాచారి, నగిషీ కళాకారుడు

### గోల్కొండ ఎల్లమ్మకు సేవ చేయడం అదృష్టం


శ్రీనివాసరాజును సన్మానిస్తున్న సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: గోల్కొండ ఎల్లమ్మకు సేవ చేయడం తన అదృష్టమని జగదాంబిక మహకాళి ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు అన్నారు. కార్యనిర్వహణ అధికారిగా నేడు పదవీ విమరణ పొందుతున్న సందర్భంగా ఆయనను అమ్మవారి వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు సాయిబాబాచారి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీకాంత్‌చారి, మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి, నాగన్న, సర్వేష్ తదితరులున్నారు.

### ముగిసిన ఫుట్‌బాల్ టోర్నీ



గోల్కొండ: 68వ హైదరాబాద్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. రిసాలబజార్‌లోని ఒవైసీ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్‌లో ఎన్‌బీటీనగర్‌కు చెందిన గవర్నమెంట్ హైస్కూల్ 1–0 తేడాతో హెచ్‌పీఎస్ రామాంతపూర్ టీమ్‌ను ఓడించింది. ఈ పోటీలకు గోల్కొండ ఒవైసీ ప్లేగ్రౌండ్ వేదిక కావడం స్థానిక ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఎంతో మేలు చేకూరుతుందని పోటీల నిర్వాహకులు, ఫుట్‌బాల్ కోచ్ సఫ్దర్ పాషా అన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్‌లో నగరంలోని పాఠశాలల ఫుట్‌బాల్ టీమ్‌లు పాల్గొన్నాయని ఆయన అన్నారు. భారతీయ విద్యాభవన్ టీమ్ మూడవ స్థానంలో నిలిచిందని, నాల్గవ స్థానంలో కుల్సుంపురా ప్రభుత్వ ఉన్నత పాఠశాల టీమ్ నిలిచిందని ఆయన తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి బాలరాజు పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయని ఆయన తెలిపారు.

### ప్రపంచ శాంతితోనే ప్రజలంతా సుభిక్షం


శాంతి సదస్సులో పాల్గొన్న విద్యావేత్త డాక్టర్ సూరెపల్లి రవికుమార్

అబిడ్స్: ప్రపంచ శాంతితోనే ప్రజలంతా సుభిక్షంగా ఉంటారని నవభారత్ నిర్మాణ్‌సంఘ్ అధ్యక్షుడు, విద్యావేత్త డాక్టర్ సూరెపల్లి రవికుమార్ పేర్కొన్నారు. కొలంబోలో జరిగిన హెచ్‌డబ్ల్యూపీఎల్ 10వ వార్షిక ప్రపంచ శాంతి సదస్సులో ఆయన పాల్గొని తన సందేశాన్ని ఇచ్చారు. శాంతితోనే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రపంచంలో శాంతిని పెంచేందుకు ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న కృషి అమోఘమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్‌ను నిర్వాహకులు మెమెంటో అందజేసి ఘనంగా సత్కారం చేశారు.

### 3 నుంచి రామాయణ మేళా


వివరాలు వెల్లడిస్తున్న గోవింద్‌రాఠి, రమేష్‌చంద్ర వ్యాస్

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అక్టోబర్ 3వ తేదీ నుంచి రామాయణ మేళా నిర్వహిస్తున్నట్లు రామాయణ మేళా చీఫ్ కన్వీనర్ గోవింద్ రాఠి, కో ఆర్డినేటర్ రమేష్‌చంద్ర వ్యాస్ పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని శంకర్‌జీ మెమోరియల్ స్కూల్‌లో వేడుకల ఘాట్ స్థాపన నిర్వహిస్తామన్నారు. దసరా రోజు రావణ దహణం, ఇతర కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సుమిత్‌రాఠి, కలవతి జాజు, గిరిదార్ లాల్ దాగా, మనోజ్ జైస్వాల్, శకుంతల, శ్యామా నవందర్ పాల్గొన్నారు.

### బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు శిక్షణా తరగతులు



క్రీడాకారులతో ట్రైనర్ విల్మ్‌సన్

గన్‌ఫౌండ్రీ: రాబోయే రోజుల్లో ఉత్తమమైన బాస్కెట్‌బాల్ క్రీడాకారులను దేశానికి అందించడమే తమ లక్ష్యమని కంబైన్ అకాడమీ డైరెక్టర్ మ్యాట్ విల్మ్‌సన్ తెలిపారు. ఆదివారం కంబైన్ అకాడమి, కీ స్టోన్ బాస్కెట్‌బాల్ అకాడమిల ఆధ్వర్యంలో పలు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యువతలో దాగిఉన్న ప్రతిభను గుర్తించి వారికి సరైన శిక్షణను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కీ స్టోన్ బాస్కెట్‌బాల్ అకాడమీ డైరెక్టర్స్ శ్రీలక్ష్మీరెడ్డి, పుష్కిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మారం జగదీశ్వర్, ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ

గన్‌ఫౌండ్రీ: ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ పేర్కొన్నారు. వ్యవసాయ శాఖలో సిబ్బంది, అధికారులకు, ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు రాకుండా ప్రత్యేక కృషి చేస్తామన్నారు. వ్యవసాయ విస్తరణ ఉద్యోగుల సమావేశంలో వారు ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి అన్ని శాఖల అధికారుల ఉద్యోగుల సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.